,,సెంకే—అయితే దీనికేమైనా ప్రైజుందా?" అన్నాను.

,,ఆ, ఉంది, బహుమానం. నేను మీకిచ్చేది" అంది.

,,ఏమిటది?" అన్నాను.

,,ఇది" అని నా మీసాలులాగి చెంపలు వాయించి ముద్దెట్టుకొంది.

,,మిస్ చివస్ దిగంబరీ!"

---

# ఫాన్సీడ్రెస్ పారేడ్

## ౧

ఆదివారం సెలవుదినం కాబట్టి సావకాశంగా వటీరావుకు అలంకరణాం చేస్తున్నాను:—ఇదివరలో వ్రాతమూలకంగా ఒప్పన్నమైన షరతులనుబట్టి:

వటీరావుతో "ప్రణయరాజ్" చేసుకొని జోళ్ళు తుడవడం, వాటికి రంగుపూయడం మాత్రం నౌకరీ కుర్రవాడికి అప్పజెప్పాను.

వటీరావు శరీర సౌందర్యపోషణ క్రియలు మాత్రము నేను చేస్తున్నాను—సంవాహనమునహా.

కత్తెరతో అలకలు ట్రించేశాను. కనురెప్పలకు మేకప్ పూర్తి చేశాను. రేజరుతో కనుబొమలు సవరించాను. బహు జాగ్రత్తగా పెదవులకు రంగుపూశాను. చెవులకు పెట్టుకొనే గుండ్రని బంగారు చక్రాలకు మెరుగుపెట్టి చెవులకు తగిలించాను. చెక్కిళ్ళకు రంగు అద్దాను. మెడకు పౌడరుకొట్టాను. తలదువ్వి వదలిపెడితే వటీరావే స్వయంగా ముడి తయారు చేసుకొంది. ఆ ముడిమీద సినీమా వైఖరిని పుష్పాలంకరణం చేసుకొంది.

నిజానికి మన పూర్వులే బుద్ధిమంతులని తోస్తుంది. భార్యలకు యిట్టి అలంకరణాలు వాళ్లే చేసేవారట — ఈ కాలంలో నాగరీకం బలవడంమూలాన్ని పురుషులు తమ విద్యుక్త ధర్మాలను నెరవేర్చడంలేదు. సౌందర్యోపాసన చేయడంలేదు. నిజానికి ఈ సౌందర్యపోషణ కార్యములు భర్త చేయడములో ఉండే ఆనందము అనుభవిస్తేనేగాని తెలియదు. అందువల్లనే పురుషులందరూ అవసరమైన ప్రయోజనకరమైన యిట్టి సహజ ధర్మాన్ని విస్మరించకూడదు. కష్టమునకు తగినఫలం ఉండకుండా పోదని పెద్దలంటారుగదా!

అంతే కాకుండా యింకో ప్రయోజనంకూడా ఉంది. వెనక భోజరాజును గురించి ఒక కథ చెప్పడంకద్దు. కాళిదాసు భోజరాజుభార్యను వర్ణిస్తూ తొడమీద మచ్చనుకూడా వర్ణిం

చాడట. ఆ మచ్చసంగతి భోజరాజుకు మాత్రమే తెలుసును అంటే స్వయంగా సౌందర్యపోషణ కార్యములలో అతను కలుగజేసికోనేవాడన్నమాటేనా! కాళిదాసుమీద కోపం వచ్చిందట. భార్యను అనుమానించాడట! చివరికు కాళిదాసు కాళీవరప్రసాదలబ్ధ ప్రభావుడని తెలిసికొని ఊరుకొన్నాడట. ఈ కథనుబట్టి నేర్చుకోవలసిన నీతి ఏమిటంటే—సౌందర్యపోషణ కార్యములూ, సంవాహనక్రియలూ స్వయముగా చేయుడము వల్ల భార్యల శరీరములయందలి సౌందర్యభాగములు అంగుళము అంగుళము దగ్గరనుంచీ తాము తెలుసుకొని ఆనందించవచ్చు. సౌందర్య వినాశనకరములైన మచ్చలూ తెలుసుకోవచ్చు. తెలుసుకొని సరియైన మేకప్ అవలంబించి వాటిని సౌందర్యభాగములుగా మార్చవచ్చు. చిన్నకత్తెరతో గోళ్ళు కత్తెరించి వాటికి రంగు పూస్తూన్న సమయంలో చెప్పింది వటీరావు ఒక సువార్త.

కల్చరుక్లబ్బు ప్రత్యేకమూ ఆడవాళ్ళకొరకేర్పాటైనదే గాని మగవాళ్ళకు దానితో ఎంతమాత్రమూ సంబంధంలేదు. మగవాళ్ళు క్లబ్బు బంగాళాలో కాలు పెట్టరాదు. చుట్టపుచూపుగా తమవాళ్ళని చూడ్డానికైనా పోవీలులేదు. కాని క్లబ్బులో మెంబర్లు చాలామంది వివాహితలైన స్త్రీలే. ఈ స్త్రీల భర్తలకుమాత్రం క్లబ్బు ప్రవేశం చేయించడం మంచిదని

కొందరు మెంబర్లు అభిప్రాయ పడ్డారు. న్యాయానికి క్లబ్ పోషణ వారివల్లనే కదా జరిగేది. చందా లివ్వవలసి వచ్చినా విరాళాలు కావలసివచ్చినా మగవాళ్ళేకదా తమ భార్యల ద్వారా ఆడబ్బు యిస్తూంట.

కాని మరికొందరు—మగవాళ్ళకు ప్రవేశం యివ్వడం ఎంతమాత్రమూ కూడదని వాదించారు. మగవాళ్ళబుద్ధి చూపిస్తే అంటించేరకం కాబట్టి అట్టిపని ప్రమాదంకరం అనిన్నీ, తమ స్వాతంత్రతకు భంగి కలుగుతుందనిన్నీ, తమ గుట్టుమట్టులు వెల్లడౌతాయనిన్నీ వాళ్ళు వాదించారు.

అవివాహితలైన మెంబర్లుకూడా అట్టిది పనికిరాదన్నారు. ఒకవేళ మెంబర్ల భర్తలను క్లబ్బులో ప్రవేశపెట్టినట్టయితే తాము న్నూ తమ మగస్నేహితులను క్లబ్బుకు తీసుకువచ్చి తీరుతామని బెదిరించారు.

తీవ్రమైన వాదన జరిగినపిమ్మట అందరూ ఒక తీర్మానానికి వచ్చారు. ఏడాదికొకమారు, మెంబర్ల భర్తలను, ఉచితమైన సందర్భము చూచి—ఆహ్వానించవచ్చుననీ, బహూకరించవచ్చుననీ తీర్మానము.

ఇదీ వటీరావు చెప్పిన సువార్త. ఈయేటి సంవత్సరోత్సవాలకి మా కందరికీ ఆహ్వానం రాబోతుందనీ అందుకు సిద్ధంగా ఉండమనీకూడా పురికొల్పింది.

"ఈ మహాకార్యానికి సిద్ధంగా ఉండడం ఏమిటి?"

"ఏమిటో మీకే తెలుస్తుందిగా, ఎందుకీ తొందర."

గోళ్లకు రంగు పుయ్యడం పూర్తి అయింది.

"ఇంకా ఏమి చెయ్యమంటావు" అన్నాను.

"థాంక్సు, మై డియర్ హబ్బీ—.

ఈ వేళకి ఈ అలంకరణం చాలు—దయచేసి నా బీరువా తలుపు తీసి అందులో చాకలేటురంగు చీర ఉంది తెచ్చిపెడతారా?"

"విత్ ప్లెజర్, మై డియర్."

"దానికి పెట్టుకొనే స్పెషల్ బ్రూచ్ కూడా తెండి."

"ఆల్ రైట్ మై డియర్—అదేదో నాకు తెలియదే."

"ఇంకా ఎన్నాళ్లు పడుతుంది తెలుసుకోడానికి? - స్లో—మీరు చాలా స్లో ఈ విషయాలు నేర్చుకోడంలో."

"సారీ డియర్, క్రమేణా నేర్చుకొంటూన్నాగా. — అదేదో ఆ బ్రూచ్ ఎలాగుంటుందో"

"మీరిలాగ తృణీకారంతో మాట్లాడరాదు-అదేదో ఇదేదో అంటూ—రెస్పెక్టబుల్‌గా మాట్లాడాలి మా అలంకారాల్ని గురించి."

"వెరీ వెల్ మై డియర్—ఆ అమూల్యమైన, అప్రతిమానమైన, అనన్య సాధ్యమైన, అవాఙ్మానస గోచరమైన—."

"షటప్" అని వటీరావు ఉరిమింది.

"సారీ కళా; సారీ వటీ - క్షమించు అన్నాను" భయంతో.

"డైమండ్ బ్రూచి తెండి."

సరే అని చీరా, బ్రూచీ తీసుకొనివచ్చి యిచ్చి నిలబడ్డాను.

"మీరు వెళ్ళవచ్చు" అంది.

కొంచెంసేపు అక్కడే నిలబడి నేను చేసిన అలంకరణ ప్రభావంవల్ల వటీరావు సౌందర్యం ఎట్టివిధంగా పోషింపబడిందో పరిశీలిస్తూ మెచ్చుకొంటూ ఉండగా 'వెళ్ళవేం' అంది. వెళ్ళాను.

౨

అనుకొన్న ఆహ్వానం వచ్చింది. వటీరావే దాన్ని స్వయంగా తీసుకువచ్చి యిచ్చింది. చిరునామా చూచుకొంటే వింత గాతోచింది. "శ్రీమతి మిసెస్ వి. కే. వటీరావు యమ్మేగారి సహధర్మచరులకు" అని వుంది. దాని క్రిందనే వటీరావు దస్తూరీతో నాపేరు వ్రాసి ఉంది.

"మీ క్లబ్బువారికి మాపేళ్ళు వ్రాయడమంటే కష్టంగా ఉంటుంది కాబోలు" అన్నాను.

"మా పేళ్లతో యిమిడ్చిరాస్తే చాలదూ? మీగొప్పకి లోటు వస్తుందా?"

"లోటు వస్తుందని కాదు. కాని—"

"అందుకనే మీ పేరు క్రింద రాశాను కదూ."

'నువ్వు రాశావులే; మీ క్లబ్బువాళ్ల సంగతి చెబుతున్నాను.'

"మీ పురుషుల వ్రాతలను చూచే మేమూ అలాగ రాస్తున్నాము. స్త్రీలపట్ల మీనడవడి మీరు మార్చుకొంటే మీకు మేమూ గౌరవం చూపుతాము. ఎంతకాలం మమ్మల్ని భాన దాస్యంలో పడి మగ్గమంటారు?"

'నిజమే వటీ- ఏది ఆహ్వానం ఎలాగఉందో చూడనియ్యి.'

కవరు విప్పి ఎర్రటి చిన్న కాగితంముక్క తీసిచూచాను. ఆహ్వానము చిన్న అక్షరాలతో అచ్చువేసి ఉన్నది.

'లేడీస్ కల్చరు క్లబ్ సంవత్సరోత్సవముల సందర్భమున డిశెంబరు ౨౭ వ తేదీ 'పురుషులదినము' గా ప్రత్యేకించుటకు తీర్మానమైనది గాన మీరు ఆ దినమున క్లబ్బుకు దయచేసి ఆనాడు జరిగే వినోదములలో పాల్గొని మే మొనర్చు సత్కారముల గైకొందురని హెచ్చరిస్తున్నాము. దయచేసి ఈ ఆహ్వానము గేటువద్ద చూపండి."

"ఏమిటా వినోదాలు? వటీ" అన్నాను.

"చెప్పకూడదు".

"మాదగ్గిర ఎందుకో మీ కార్యరహస్యాలన్నీ

"పులులనూ పురుషులనూ నమ్మకూడదని ఒక సామెత ఉంది—"

## ఫాన్సీ డ్రెస్ పారేడ్

"మీళ్లబ్బా సామెతా?"

"అవును 'మాళ్లబ్బసామెతే — మాళ్లబ్బ ఓకసబ్ కమిటీని ఏర్పాటుచేసి సామెతలను కూర్చమన్న మాట వాస్తవమే."

"ఆ సామెతలన్నీ మమ్మల్ని గురించేట కాదా?"

"అవును; ఆ సామెతలన్నీ పురుషుల్ని గురించే — ఆ పుస్తకంకూడా తయారైంది. అచ్చు కాబోతోంది. ఇక మీరేం చేస్తారో చేసుకోండి."

"మేమేం చేస్తాము కాని - అందులో కొన్ని సామెతలు రుచి చూపుదూ —."

"తినబోతూ రుచులెందుకూ - క్రమేణా ఆ సామెతలన్నీ మీకు అనుభవంలోకి రాబోతున్నవి కాదూ!"

"అయితే ఆ సామెతలన్నీ మీరు నేర్చుకొని మామీద ప్రయోగిస్తారన్న మాట —"

"లేకపోతే కమిటీ నేర్పాటు చెయ్యడమెందుకూ - పుస్తకం రాయడమెందుకూ - అచ్చు వెయ్యడమెందుకు?"

"కానీ-ప్రయోగించండి. మేము-కాక్ సామెతల పుస్తకం, సుమతీశతకం భర్తృహరి, తీగవేస్తాము."

"తిరగ వెయ్యండి. బెదిరింపా? మీ బెదిరింపులు చూచి భయపడే వాళ్లెవరూ లేరు లెండి. తాటాకు చప్పుళ్లకు కుందేళ్లు బెదరవు మగవాళ్ల బీరాలకి మానవతులూ బెదరరు."

వటీరావు కథలు

సరేకాని, వటీ, మైడియ్యార్ హనీ, మమ్మల్ని మామూలుగా, పెద్దమనిషి తరహాగా పిలవక "పురుషులదినము" అని పేరుపెట్టి తృణీకరించడం న్యాయంగా ఉందా?"

మీ తాహతుకు సరిపోలేదు కాబోలు పిలుపు—పోనీ పురుషుల దినమనకుండా మృగములదినమనా ఏమనాలని మీ ఊహ? మీరు పురుషులు కారా?"

"ఆ ప్రత్యేకత ఎందుకంట"?

"మీరు నేర్పిందే."

"అయితే నేను రాను."

"రాకూ? రాకపోతే ఏభై రూపాయిలిచ్చుకోండి"

"మధ్య నేను ఎందుకు ఇచ్చుకోవడం?"

"మీరు రాకపోతే నేనే ఆయెను."

"నువ్వుమాత్రం ఎందుకు ఇచ్చుకోవడం?"

"తమ భర్తలను తీసుకరాలేని భార్యలు తామా భైరూపాయిల చొప్పునా క్లబ్బుకు చెల్లించాలని రూలు."

"చంపేవే! పోనీ మనిద్దరం కలిసి వెడదాంలే."

"నేను మీతో రాను."

"రాకూడదని రూలా?"

"రెండు రోజులు ముందునుంచీ మేమంతా క్లబ్బులోనే ఉండాలి."

రావి

"నేను రాకపోతే యాభైరూపాయల దండుగ ఒకటేనా?"

"నాకు న్యూనత ఒకటి."

"అయితే వచ్చి తీరుతాను. నా పటీరావుకు, నా పోల్‌కి న్యూనత భరించగలనా?"

"దటీజ్ గుడ్ హాబ్బీ."

"అయితే, పటీ, ఆనాటికి శేషాలు కొంచెం నా చెవిని వేయకూడదూ— నీకు సహధర్మచరుణ్ణి— గుడ్ హబ్బీనీ—."

"కూడదని చెప్పేగా— మీకు మందమతిగాని."

"ఏమైనా బహుమతులుంటాయా?"

"ఉండకుండా ఉంటాయా?"

"పురుషులదినమున బహుమతులుంటవన్న మాట, అవునా?"

"చెప్పకూడదన్నమాట, అవునా?"

"డెక్, ప్లీజ్ యువర్ సెల్ఫ్. అయితే ఆనాడు ఏమి డ్రెస్సు వేసుకోవాలో, ఏవిధంగా సంచరించాలో — ఏమైనా ఇన్‌స్ట్రక్షన్స్ యిస్తావా?"

"సలహా కావాలా మీకు — ఆరోజున సూటు వేసుకొన్న, హాట్ పెట్టుకోమంటే పెట్టుకొంటారా?"

"అదిగాక యింకా ఏమైనా —."

"ముందర ఈసంగతి చెప్పండి."

"జాని సంగతి తరవాత చూసవచ్చుగాని - యింకా ఏమైనా చెప్పేదుంటే చెప్పు."

"మంచి పిల్లవాడిలాగ వచ్చి, అక్కడ మెంబర్లతో అనవసర ప్రసంగాలకి దిగక, కళ్లు తెరచి ఉండమని సహధర్మచారులకు నా సలహా."

"ఆల్ రైట్— మై డార్లింగ్."

"మీరు అనవసర ప్రసంగాలలోకి దిగినా, కళ్లు తెరచి ప్రవర్తించకపోయినా మీ మీద నేను డిసిప్లినరీయాక్షన్ తీసుకోవలసి ఉంటుంది."

"రైటో, డియర్."

"ఆడవాళ్లనిగురించి బహుమర్యాదగా అక్కడ మెంబర్లతో మాట్లాడాలి సుమండీ—నాతో మాట్లాడినట్లు న్యూనతగా మాట్లాడితే—."

"మాట్లాడితే?"

"దేహశుద్ధి అవుతుంది. మా మెంబర్లలో కసరతుచేసినవాళ్లున్నారు, జుజుట్సు నేర్చినవాళ్ళున్నారు, బాక్సింగ్ నేర్చినవాళ్ళున్నారు—మీరు బహు జాగ్రత్తగా ఉండాలి. మీకు అవమానం జరిగితే నాకు చాలాకష్టంగా ఉంటుంది. ఫలానా వటీరావు సహధర్మచారి యీ విధంగా సంచరించి అవమానం పాలయాడనే మాటరాకూడదు."

"నన్ను నిష్కారణంగా యీ పులులమధ్య—బెగ్ యువర్ పార్డన్—ఈ కత్తులబోనులో ఎందుకు దూరుస్తావు, కళా!"

"ఆమాత్రం డిసిప్లిన్ నేర్పితేనేగాని మగవాళ్లని పట్ట పగ్గా లుండవు—అందుకని."

"సరే జాగ్రత్తగానే ఉంటాను."

"గుడ్డే, డియర్, నేను షాపింగుకు వెళ్లి వస్తాను."

"గుడ్డే—స్వీటీ."

## 3

౧౫-వ తేదీనే పటీరావు క్లబ్బుకు లేచిపోయింది. మళ్లీ దర్శనం ౨౮-వ తేదీని నేను క్లబ్బుకు వెళ్లడానికి సిద్ధపడుతున్నాను. ఉదయాన్నే లేచి స్నానాదికం పూర్తి చేసుకొని ఆనీబెసెంటు భగవద్గీత రెండో అధ్యాయం ఒకమాటు చదివి ఈ గండం గడిచేవిధం ఎలాగా అని ఆలోచిస్తున్నాను. ఇంతకీ నాకు బెంగ ఎందుకు? పటీరావు అక్కడ ఉండనే ఉంటుంది. ఏమివచ్చినా సర్దుకుపోతుందని మనస్సమాధానం చేసుకొన్నాను.

మధ్యాహ్నం ఒంటిగంటకి ఒక చిన్న కారు వచ్చి మా పోర్టికోలో నిలిచింది. నేనూ డ్రెస్సు వేసుకోవడం పూర్తి చేసి నడిచి వెళ్లడమా కారుమీద వెళ్లడమా అని ఆలోచిస్తున్నాను.

చిన్న కారులోంచి ఒక బొమ్మ-పూతే బొమ్మ బయటికి ఊ

కింది. నా వైపు గబగబ వస్తూ "హల్లో మిస్టర్ రావ్" అని కేక వేసింది.

"హల్లో" అని చెయ్యి చాపాను నేను. నా చెయ్యి గట్టిగా పట్టుకొని జాడించి "మీరు నన్నెరుగరు కాబోలు. నా పేరు మిస్ హాల్. మిమ్మల్ని క్లబ్బుకు తీసుకు వెళ్లడానికి వచ్చాను. వస్తారా? అన్నది.

"సంతోషపూర్వకంగా వస్తాను. కాఫీ — లేదా మీకు ఇష్టమైతే — టీ పుచ్చుకొంటారా" అన్నాను.

"థాంక్సు అఫులీ! టైము లేదు. మీరు రావాలి" అని నన్నీడ్చుకుపోయి కారులో కూలవేసింది.

చేతులకి రంగు పట్టుకోలేదు గదా అని చూసుకొంటూ కారులో ఒక మూల నక్కి కూర్చున్నాను.

"గొర్రెలమందను తోలడమన్నా, పసివాళ్లను పిలుచుకు రావడమన్నా మహా కష్టమండీ రావుగారూ."

నేను మాట్లాడలేదు వటీరావు హెచ్చరిక జ్ఞాపకం చేసుకొని.

"ఏమంటారు" అంది. కారు వడిగా పరిగెడుతోంది. ఆడదానివల్ల మాటపడనా అని రోషంవచ్చి "వెనకటి సామెత ఒకటుంది ఈ కాలానికి పనికిరాదు కాబోలు" అన్నాను.

"పూర్వకాలం అంటే మీకు చాలా ఇష్టమని విన్నాను. ఏమిటి ఆ సామెత?

"చీర సింగారించేసరికి ఊరు మాటు మణుగుతుందని. ఆవిడకు కోపం రాలేదు. నవ్వింది."

"ఈకాలపు సామెత వేరు అంది."

"ఏమిటది?"

"పందకట్టేసరికి పడమటికి పొద్దు చేరుతుందని."

కారు క్లబ్బు గేటువగ్గిరకి వచ్చి నిలిచింది. మిస్ హాల్ లేచి తలుపుతీసి నేను దిగేదాకా తలుపు తెరిచి పట్టుకొంది. నేను దిగాను. నేను థాంక్సు చెప్పకముందే అమె కారులోకూచుంది. కారు కదిలి పారిపోయింది.

నేను సందేహిస్తూ సందేహిస్తూ క్లబ్బులో ప్రవేశించాను. గోడలమీద "సఫర్ జెట్టి"ల బొమ్మలు వేలాడుతున్నాయి. వరాండాలో బల్లలూ కుర్చీలూ ఇంగ్లీషు న్యూసుపేపర్లూ ఉన్నాయి. అక్కడ కూర్చోవడమా లోపలికి వెళ్ళడమా? లోపలికి వెళ్ల నిశ్చయించి గుమ్మందాటబోతే అక్కడ ఒక అలికులవేణి "హూ యూ" అని అరిచింది. వెనక్కి తగ్గాను. ఆహ్వానం చూపాను. "ఆకుర్చీలు మీకోసమే" అని మాయమైంది.

ఒకకుర్చీమీద కూర్చుని "హెల్తు అండు ఎఫిషంసీ" పత్రిక తిరగవేస్తున్నాను.

* * *

క్రమక్రమంగా మగభర్తలు ప్రవేశిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క బల్లదగ్గర కూర్చుంటున్నారు-అక్కడే వేలాడగట్టిన బోర్డు సలహా ప్రకారం. భర్తలందరూ వచ్చి బల్లదగ్గిర కూర్చున్నారు. ఒక్కొక బల్లదగ్గిర ఒక్కొక్క అవివాహిత మెంబరు వచ్చి కూర్చుని మమ్మల్ని ప్రసంగాల్లోకి దింపింది.

నాబల్లదగ్గిర మిస్ హాల్ కూర్చుంది. కొంతసేపు యోగక్షేమాలు మాట్లాడుకొన్నాము. కొంతసేపు వెదర్‌ను గురించి మాట్లాడాము. గాలి, వాన, ఎండలను నేను భూషించడం ఆవిడ దూషించడం అయిన పిమ్మట కొంతచనువు చిక్కడం మూలాన్ని ఆవిణ్ణి అడిగాను "మిస్ హాల్! మీకు కోపం రాకపోతే ఒక ప్రశ్న అడగనా?"

"వెరి వెల్" అంది.

"మీరు చూడబోతే హిందువులాగ ఉన్నారు-మీ పేరు-"

"వెల్, మిస్టరు రావ్. మావాళ్ళు పూర్వకాలపువాళ్ళు. సూపర్‌స్టిషస్ పీపిల్. నా పేరు మొదట వరహాలమ్మ అని పెట్టారు. అది బార్బరస్‌గా ఉండడంవల్ల నేను బియ్యే చదివే రోజుల్లో నా పేరు మార్చుకొన్నాను. ఇప్పటి నా పేరు సి. వి. హాల్. ఈ పేరు బాగుండలేదూ?"

"ఎంతో బాగుంది. కాని—."

మిస్ హాల్ వినిపించుకోవడంలేదు. నాకోసం టీ తెప్పించి కలిపి కప్పు నాముందర పెట్టింది. బిస్కత్తులు వగైరాలు ప్లేట్ల లోపెట్టి నన్ను తినమని బలవంతంచేసింది. నేను తినకపోతే— ఎంతబాగుందో చూడమని ఒకబిస్కత్తు కొరికి తను తింటూ మిగిలినముక్క హఠాత్తుగా నా నోట్లోకి తోసింది. ఏమిచేసేది, తిన్నాను. టీ తాగాను. మిస్ చివరగా నాకేసి చూచి హాల్ నవ్వుతోంది. నేను 'థాంక్సు' అన్నాను.

వటీరావుజాడ ఎక్కడా కనిపించడంలేదు. ఈ కన్యామణి నడిగితే ఏమనుకొంటుందో అని భయంగా ఉంది. అయినా తెగించి అన్నానుగదా 'మిస్ హాల్, పాపం మీరే యీశ్రమంతా తీసుకొంటున్నారు. వటీరావుగారు...'

'సారీ మిస్టర్ రావ్, నేను మీకు కంపెనీ కీప్‌చేస్తూంటే యితరులపేరు ఎత్తుకోవడం చాలా అనుచితమైన పనికాదూ?'

'బెగ్ యువర్ పార్డన్.'

ఆవిడ నన్ను క్షమించిందనడానికి నిదర్శనంగా తన అలంకారాలు, తన డ్రెస్సూ, తన మేకప్పూ ఎంత బాగున్నవో మెచ్చుకోమంది. నేను స్వయంగా అనుభవం సంపాదించినవాడనుకాబట్టి ఎక్స్‌పర్టునట. అందువల్ల నేను అన్నీ మెచ్చుకోన్నాను. అందుకుగాను ఆవిడ నన్నెంతో పొగిడి నావంటివాడు పృథివిలో లేడంది. ఆసంగతి వటీరావుతో కొంచెం చెపుతారా అని అడిగేసరికి ఆవి

డకు కోపంవచ్చింది. ఎందుకో? నా అదృష్టంకొద్దీ ఆ సమయాన్ని ఒక కన్యక బాబ్డు జుట్టుతో ప్రవేశించింది. చేతులతో ఒక ట్రే పట్టుకొంది. ట్రేలో కవర్లున్నాయి. అందరు మగవాళ్ళ దగ్గిరకీ వెళ్ళింది. తలొక కవరూ తీసుకొన్నారు. నేనూ ఒక కవరు తీసుకొని లోపలి కాగితం లాగి చదవబోతూంటే మిస్ హాల్ మాయమయింది—

కాగితంలో ఉన్న విషయం యిది—

'పురుషులకు ప్రోగ్రాం—ఫాన్సీడ్రెస్ పారేడ్.

'మీ మీ భార్యలు కొత్తకొత్త వేషాలతో మీకు దర్శనమిస్తారు. వేషాలు బహు జాగ్రత్తగా పరిశీలించి చూడండి. అందులో మీ భార్యలను మీరు గుర్తుపట్టగలరా? మీరు సరిగా గుర్తుపట్టారనడానికి నిదర్శనంగా వేషములో ఉన్న మీ భార్యలను ముద్దుపెట్టుకోవలసి ఉంటుంది. సిగ్గుపడకండి. ముద్దుపెట్టుకోండి. గుర్తుపట్టినా పట్టకున్నా ఉభయత్రా లాభం మీదే.'

నాకు వెన్నులో చలి ప్రారంభమైంది. లేనిపోనిది తెచ్చిపెట్టుకున్నా ననిపించింది. గుర్తుపట్టగలనా లేనా? ముద్దుపెట్టుకోవడం ఎందుకో? ఎవళ్లు సంతోషించడానికి? పోల్చుకోలేకపోతే వటీరావుకు ఏమి కోపం వస్తుందో? తప్పిజారి ఇంకో మెంబర్ని ముద్దుపెట్టుకోవడం తటస్థిస్తే యిక వటీరావుముఖం చూడ్డం ఎలాగ?

ఈ బాధలోపడి కొట్టుకొంటూంటే గంటకొట్టారు. మగవాళ్ళందరూ హాల్లోకి రావచ్చునని అనౌన్సు చేశారు. హాలులోకి వెళ్ళాము.

హాలులో సోఫాలు, టేబిల్సు, వాటిమీద పువ్వులబుడ్లు, రంగుకాగితాలతోరణాలు, అత్తరుపు వాసనలు, పన్నీరు స్ప్రేలు; సోడాలు, టీసెట్లులు—వైభవంగా ఉంది. నాపేరు వ్రాసిఉంచిన సోఫామీద నేను కూర్చున్నాను. అందరూ ఆవిధంగానే నియమితస్థలాల్లో ఆసీనులయ్యారు. నాలాగే పురుషులందరూ—ఒకరిద్దరుతప్ప— బిక్క-మొహంతోనే ఉన్నారు. మేము ప్రవేశించేసరికి హాలులో ఆడపురుగులేదు. ఏ కొద్దిపురుషులోతప్ప మిగిలినవాళ్ళంతా సిగరెట్లు ముట్టించి తమదుఃఖాన్నీ, బెంగనూ దిగమింగడానికి ప్రయత్నిస్తున్నారు. నామట్టుకు నేను 'తాం స్తితిక్షస్వ భారత' అనే కృష్ణవాక్యం జ్ఞాపకం చేసుకొన్నాను.

ఠంగున గంటకొట్టారు. మేమంతా ఉలిక్కిపడి నిలువుగా కూర్చున్నాము. బాబ్డుజుట్టు కన్యామణి వచ్చి జరగబోయే విషయం ప్రకటించింది. చల్ మోహనరంగా అనేపాట—అని చెప్పి వెళ్ళిపోయింది.

* * *

తెర తొలగించుకొని ప్రథమవేషం ప్రవేశించింది. చక్కగా పాడుతోంది. చంకలో కడవవుంది. కడవనిండా నీళ్లుఉన్నాయి.

అవి కన్నీళ్ళని మేము భావించవలెనని పాట ఉద్దేశము.—కంటికి కాటుకెట్టి కడవా చంకానుబెట్టి కన్నీరు కడవ నిండెనుగదరా చల్ మోహానరంగా—అనేపాట చిరునవ్వుతో మిళితమై వచ్చింది.

ఆస్త్రీ - వటీరావు కామకద!— కంటినిండా కాటుక పులుము కుంది. పెద్ద కుంకుంబొట్టు పెట్టింది. కొప్పుపెట్టింది. ముతకచీర కట్టింది. నవ్వుతూ, మాకేసిచూచి, కనుబొమ లెగరవేస్తూ, ప్రతి ఒక పురుషుణ్ణి మోహానరంగడిగా భావించినట్లు అభినయిస్తూ పాడింది— బహు చక్కగా పాడింది.

వటీరావుకు అంత చక్కగా పాడడం రాదు కాబట్టి ఆవిడను ముద్దుపెట్టుకోనవసరం లేదనుకొన్నాను.

కాని ఆవిడపాటకు ముగ్ధులై పదిమందిభర్తలు అమాంతంగా ఆవిణ్ణి ముద్దుపెట్టుకోడానికి లేచారు. అవిడ తెరలోకి పారిపో యింది. వాళ్లు కూలబడ్డారు సోఫాల్లో.

* * *

బొట్టుజుట్టు పద్మముఖివచ్చి పురుషులకేసి తీక్ష్ణంగాచూచి యీవిధంగా చెప్పింది :

'పురుషులు సరిగా ప్రవర్తించకుంటే పోలీసులకు ఫోన్ చేయవలసి ఉంటుంది కాబట్టి జాగ్రత్తగా మెలగమని హెచ్చ రిస్తున్నాను. వచ్చినవేషాలల్లా ప్రస్తుతం మీరు పరిశీలనగాచూచి ఆనందించవలెను. వేషము లైనపిమ్మట వేషధారిణులందరూ

మళ్లీ హాలులోకి వస్తారు. అప్పుడు మీామీా భార్యారత్నములను గుర్తించి ముద్దుపెట్టుకోవచ్చు.— ఇక — కులధర్మపత్ని వేషం—' అని ప్రకటించి వెళ్ళిపోయింది.

ఒక బొద్దుస్త్రీ ప్రవేశించింది. పచ్చచీర అడ్డకట్టు కట్టుకొంది. అందెలు, కడియాలు, అడ్డబాస, నత్తు, రాగిడీ, చంద్రవంకా వగైరా ప్రాచీనాభరణాలు ధరించింది. కొప్పు పెట్టుకొంది. పసుపు పూసుకొని, కుంఖంబొట్టు పెట్టుకుంది. కాళ్ళకి పారాణి పూసుకొంది. కంటికి దట్టంగా కాటుక పెట్టుకొంది. ఒకచేత్తో గరిటా పట్టుకొంది. వచ్చి కొంచెంసేపు నిలబడి పురుషులను పరకాయించిచూచి శ్లోకం ఎత్తుకొని శ్రావ్యంగా చదవ మొదలు పెట్టింది. 'కార్యేషు దాసీ, కరణేషు మంత్రి' అనేశ్లోకభాగం అభినయిస్తోంది. కార్యేషుదాసీ అన్నప్పుడు గరిటఎత్తి చూపింది. కరణేషు మంత్రి అన్నప్పుడు చీపురుఎత్తి చూపింది. రూపేషులక్ష్మి అన్నప్పుడు తనకేసి చూపుకొంది. మిగిలిన అభినయం నాకు బోధపడలేదు. చివరకు 'షట్కర్మయుక్తా కులధర్మపత్నీ' అని ముగించి వెళ్ళిపోయింది. ఈవిడ వటీరావు కాదని నిశ్చయించుకొన్నాను. వటీరావు బొద్దుగా ఉండదు.

* * *

బొట్టుజుట్టు వచ్చి - ౧౮ వ శతాబ్దం పతివ్రత—అని ప్రకటించి వెళ్లిపోయింది.

ఒక ముసలివాడు దగ్గుకుంటూ వస్తున్నాడు, గావంచా కట్టుకొన్నాడు, కుడితీసీ తొడుక్కున్నాడు, బట్టతల పాగా పెట్టుకొన్నాడు, చేతిలో కర్ర పట్టుకొన్నాడు. రెండవచేతిలో తాడు వుంది—ఆ తాడువెనకే ఒకజవ్వని వచ్చింది. ఆ తాడుకొస ఆవిడ ముక్కు నత్తుకు ముడివేసిఉంది. కులధర్మపత్ని వేషంవంటి వేషమే ఆ పతివ్రతదిస్నీ- కాని చీపురూ గరిటా లేవు. రెండుచేతులూ జోడించి భర్తకేసేచూస్తూ అతడు తాడుపట్టుకు తీసుకువెళ్లిన చోటికి వెడుతోంది. ఎలుగుబంటిని తిప్పినట్లు ముసలివాడావిడను హాలల్లా తిప్పాడు. అప్పుడప్పుడు కర్రతో బెదిరించి పొడిచేవాడు. ఆవిడ ఏమిచేసినా కిక్కురుమనలేదు. భక్తిముద్రతోనే ఉన్నది. వాళ్ళు వెళ్లిపోయారు.

వటీరావు ముసలివాడా అని ఆలోచించాను. ఆ ఆలోచనే అసహ్యకరంగా ఉంది. ఇక ఆ పడుచుమనిషి ఎర్రగా ఉంది. వటీరావు చామనచాయ. కాబట్టి ఆవిడ వటీరావుకాదు.

* * *

వెంటనే బాబ్డుజుట్టు కేక వినిపించింది.

౨౦ వ శతాబ్దం—నేటిస్త్రీ—అని. పచ్చని పట్టుచీర—ఒంటికి అంటుకుపోయేరకం చీరకట్టుకొంది. చేతులూ, మెడా లేని రవిక తొడిగింది. గిరజాలజుట్టు; మెళ్ళో ఒకే సన్ననిగొలుసు; ఒకచేతికి

ఎనామెల్ గాజు; రెండో చేతికి రిస్టువాచీ, మొహానికి పౌడరు వగ యిరాలు; కాళ్ళకు ఎత్తుమడమలజోడు; కళ్ళకు సులోచనాలు.

సిగ్గొలుకాలుస్తూ ప్రవేశించింది. బంగారుశలాకలాగ ఉంది.

వెనకనే ఆమెభర్త ప్రవేశించాడు. అతనిమీసానికి కట్టిన తాడు ఆవిడ చేత్తో పట్టుకుని అతణ్ణి హాలంతా నడిపిస్తోంది. షరాయి తొడుక్కున్నాడు, లాల్చీ వేసుకొన్నాడు. కండువా మడత బుజంమీద వేసుకొన్నాడు. కారాకిళ్లీ నములుతూ చుట కాలుస్తున్నాడు—ఆ భర్త.

ఆ నవీనస్త్రీ వటీరావేమోనని అనుమానించాను—అంతేఎత్తు, ఆదేరంగుదేహం, అంతేలావు, కాని వటీరావుకు మడమలదాకా జుట్టు ఉంది. ఈమెకు గిరజాలకుట్టు—అంతేకాకుండా కొంచెం మెల్ల కూడా ఉన్నట్టుంది ఈవిడకు—వటీరావు కాదేమో? అయినా కంఠస్వరంవింటే తెల్సుకోవచ్చునేమో? భర్తవేషం వేసిన యిల్లాలుమాత్రం వటీరావుకాదని నిశ్చయించాను. ఆ మీసాల మొహం చూస్తే అసహ్యంగాఉంది. ఆడవాళ్ళు మగవేషాలు వేస్తే ఎంతకోతిగా తయారవుతారో అనిపించింది.

నవీనస్త్రీ ఒకరాయి భర్తకిచ్చి 'ఇది పుట్టింటారికండ పుట్టింటారికండ' అంది. భర్త రాయి చేత్తోపట్టుకొని కిందకు విసిరి వేశాడు.

మళ్లీ రాయిచేతికిచ్చి 'ఇది అత్తారెకుండ అత్తారెకుండ' అంది. మళ్లీ రాయి కిందవారేశాడు. మళ్లీ 'ఇది పెళ్ళాంకుండ పెళ్ళాంకుండ' అంది.

భర్త ఆరాయి పుచ్చుకొని నెత్తిమీద పెట్టుకొన్నాడు. తాడు పట్టుకు నవీనస్త్రీ భర్తను తెరలోకి తీసుకుపోయింది.

నవీనస్త్రీ కంఠస్వరం వటీరావుదికాదు. కాబట్టి ఆవిడ వటీరావు కాదని నిశ్చయించాను.

* * *

'దండోరా' అనే బొబ్బుజుట్టుపలుకు వినిపించింది.

డప్పుపట్టుకొని వాయిస్తూ ఒక పొట్టిమనిషి ప్రవేశించాడు. లాగుతొడుక్కున్నాడు. జుబ్బా వేసుకొన్నాడు. తలపాగా పెట్టుకొన్నాడు. మొహానికి మసిబొగ్గు పూసుకొన్నాడు.

'ఇందువల్ల సకలజనులకూ తెలియజెయ్యడం ఏమంటే— స్వర్గంలో యిప్పుడు రూల్సు మారినట్టు రూఢియైన వార్తలు వచ్చినవి. పూర్వకాలంలో, మరణించినభర్తతో సహగమనము చేసే స్త్రీకి స్వర్గం లభించేదిట. నేటికాలంలో కొత్తరూల్సు ప్రకారం మరణించిన భార్యతో భర్త సహగమనంచేస్తే అతనికి స్వర్గం వస్తుంది కాబట్టి ఈ అవకాశం గమనించి పురుషులు స్వర్గప్రవేశానికి ప్రయత్నాలు చేయవలసి ఉంటుందహొహోయి...

మరెన్నో పూర్వకాలంలో. యజ్ఞముచేసిన పురుషులకున్నా యుద్ధములో మరణించిన పురుషులకున్నా స్వర్గప్రవేశమే కాకుండా రంభాసంపర్కం కూడా ఉండేదట. నేటికాలంలో కొత్త రూల్సుప్రకారం పురుషులుగాని స్త్రీలుగాని యజ్ఞయాగాదులు చేయనక్కరలేదు కాని యుద్ధములో మరణించిన పురుషులకు రంభాసంపర్కమున్నా స్త్రీలకు నలకూబర సంపర్కమున్నా కలుగుతుందనేవిషయం తెలుసుకోండో హోయ్. . . .

చాటింపు అయినతరువాత డప్పుకొట్టుకొంటూ ఆమనిషి నిష్క్రమించాడు. దండోరామనిషి పటీరావుకాదు. పటీరావు పొడుగు. కంఠస్వరము వేరు.

* * *

మళ్లీ బాబ్డుజుట్టుకన్య ప్రకటనకుబదులు గంట వినిపించింది. పదినిమిషాల విశ్రాంతి పురుషులకిచ్చినట్లు తెలిసింది. అవివాహితలువచ్చి మమ్ము సత్కరిస్తున్నారు. పన్నీరుస్ప్రేలు హాలంతా మేఘాలుకట్టాయి. అత్తరులు వర్షాలుకురిశాయి. సోడాలు తాగాము. మళ్లీ కొత్తగాకలిపిన టీలు సేవించాము. లోపలినుంచి గ్రామఫోనుపాటలు వినిపిస్తున్నాయి. మిస్ హాల్ 'మీ భార్యారత్నాన్ని పోల్చుకొన్నారా' అని అడిగింది.

'సారీ, నో' అన్నాను. మళ్లీ గంటకొట్టారు. విశ్రాంతికాలం పూర్తి అయింది.

'యాభై సంవత్సరములనాటి వింతమనిషి' అని బొమ్మజెట్టు చెప్పి నవ్వుతూ వెళ్ళిపోయింది.

'నేను అత్తపిశాచాన్ని; కోడళ్ళని కొరుక్కుతింటాను; వాళ్ళ రక్తం పీలుస్తాను; వాళ్ళ కాపురాలకి చిచ్చుపెడతా' అంటూ అరుస్తూ గంతులేస్తూ ప్రవేశించింది ఒకస్త్రీ. చింపిరిజుట్టు, ముడత తలమొహం, చేతుల్నిండా గాజులు, మెడనిండా నగలు. చేతులో కాల్చినగరిట పట్టుకు జళిపిస్తోంది. కొంతసేపు ప్రళయతాండవం చేసి ఆర్చి ఆవిడ నిష్క్రమించింది.

ఈవ్యక్తిని ముద్దుపెట్టుకొనే దురదృష్టం ఎవరికి పడుతుందో గదా అనుకొంటూ ఆవిడ వటీరావు ఎంతమాత్రమూ అయి వుండదని నిశ్చయించాను.

* * *

బొమ్మజెట్టువచ్చి 'ఎరుకలసాని సోడె' అనిచెప్పి వెళ్ళింది.

గంప నెత్తిమీద పెట్టుకొని, ముతకచీరకట్టి, పూసలపేర్లు మెళ్ళో వేసుకొని బుజానికి పిల్లవాణ్ణి (జపాను పిల్లవాడి బొమ్మ) కట్టుకొని ప్రవేశించింది ఎరుకలసాని—

'ఎరకడుగమ్మ ఎరకడుగమ్మ ఎరకడుగమ్మతల్లీ! ఎరకచెప్పుతా ఎరకచెప్పుతానేతల్లీ— చేటలో చేటెడుబియ్యంపోసి తేవేతల్లీ— బియ్యంమీద చెయ్యిపెట్టవే— ఎరకచెప్పుతానేతల్లీ' అంటోంది. తెరలోంచి మిస్ హాల్ ఒకట్రేలో పాతకాగితాలు — చేటకు

ప్రత్యామ్నాయం తెచ్చి దానిమీద చెయ్యిపెట్టి తనకు ఎరుక చెప్పమంది.

'ఎరుక చెప్పుతానే తల్లీ—ఎరుక చెప్పుతా—నువ్వడిగే ప్రశ్న—నీ మనసులో మణిగిపోయిన ప్రశ్న—నీకడుపులో ఊహా ఏమిటో చెప్పమంటావా తల్లీ—వినవేలమ్మా—నీవు పెళ్లిమీద మనసెట్టుకున్నావే తల్లీ—నీకు మంగళసూత్రంమీద మనసులేదే తల్లీ! మగవాడి మీద మనసుందే అమ్మా—నీకు పసుపూ కుంకుంమీద మనసు లేదే తల్లీ! పౌడరుమీద మనసుందే అమ్మా—నీకు ఇంట్లో వంటింటి గొడవ లేదే తల్లీ! బయట ఉద్యోగాలగొడవ ఉందే అమ్మా—నీకు పెళ్లవుతాది పెళ్ళవుతాది—నీకు బిడ్డలమీద మనసులేదు—నీకు కానుపులమీద మనసులేదే తల్లీ—కాంట్రసెప్టివులమీద మనసుందే తల్లీ! పెనిమిటి ఎర్రగా ఉంటాడా అంటావుగాదటే అమ్మా.

'పెనిమిటి ఎర్రగానే ఉంటాడే తల్లీ, లాగులు తొడుగుతాడే అమ్మా—కలకటేరుఉద్యోగం చేస్తాడా అంటావు గాదటే తల్లీ—చెప్పుతా, పాతకోక యియ్యవే అమ్మా' అంటూ వెళ్లిపోయింది.

ఎరకలసాని వటీరావుకాదు. వటీరావు లేతమనిషి; ఈమె ముదరది. కంఠస్వరంకూడా భేదించింది అనుకొంటూండగా నాగస్వరం వినిపించింది.

* * *

బొబ్బుజుట్టు పంకజలోచనవచ్చి కాగితంచూచి— ఇక వ్యంగ్య వేషము— అని ప్రకటించి వెళ్ళిపోయింది.

నెత్తిమీద పాములబుట్ట పెట్టుకొని పాములవాడు ప్రవేశిం చాడు. తలమీద తీవిగా తలపాగాపెట్టేడు. దానిమీద పక్షి వెంద్రుకలు ఎర్రటివి గుచ్చాడు. షర్టుతొడిగాడు. పంచకట్టె వెనక్కి బిగించాడు. మెళ్ళో పూసలదండా చేతిలో నాగస్వర మున్నూ ఉన్నవి.

వచ్చి బుట్ట కిందపెట్టె బుట్టమూతతీశాడు. అందులో జపాను సెల్లిలాయిడ్ బొమ్మ ఉంది. ఆబొమ్మ మగబొమ్మ. దాని నెత్తిమీద కాగితపుపాము పడగకట్టి ఉన్నది.

వెంటనే బొబ్బుజుట్టు రెండుఅట్టలు చేత్తో పట్టుకువచ్చింది. ఒకఅట్ట చూపింది. దానిమీద 'స్త్రీ' అని వ్రాసిఉంది. ఆ అట్ట పాములవాడి మెడకు తగిలించింది. రెండవఅట్ట చూపింది. దాని మీద 'మగవాడు' అని వ్రాసిఉంది. ఆ అట్ట జపానుబొమ్మ పడగమీద తగిలించి మాకేసితిరిగి నవ్వి వెళ్లిపోయింది.

అప్పుడర్థమయింది వ్యంగ్యవేషమంటే ఏమిటో మాకు. మగ వాడైన పామును, ఆడదియైన పాములవాడు నాగస్వరం ఊది ఆడిస్తున్నాడు. తెల్ల ఈశ్వరవేరు ముక్క- దానిపడగకు తగిలిస్తు న్నాడు. బొమ్మ యిటూ అటూ ఆడుతోంది. కొంతసేపు నాగ స్వరం ఊది, పడగదీసి దానిలోఉన్న రెండుకోరలను ఊడలాగి

పాఠవేసి, నాగస్వరంతో ఆబొమ్మను నాలుగుబాది, బుట్టపట్టుకు లేచిపోయాడు పాములవాడు.

పాములవాడు వటీరావుకాడు. భర్తమీద ఆవిడకంత కోపం లేదని నా అభిప్రాయం.

*  *  *

బొబ్బజుట్టు వచ్చి 'తీర్పులు' అని అన్నౌంసుచేసి వెళ్లిపోయింది.

కోర్టుసీను ప్రారంభమైంది. మేస్త్రీటువచ్చి కుర్చీలో కూర్చున్నాడు. తరవాత ఒకస్త్రీ వచ్చి ఒకపక్క నిలబడింది. ఒక కనిస్టేబు ఒకపురుషుని చేతులకు సంకెళ్ళువేసి తీసుకువచ్చి నిలబెట్టాడు మేస్త్రీటు కెదురుగా.

"ఇతడుచేసిన నేరమేమిటి" అన్నాడు మేస్త్రీటు.

"దేవరా! యితడు అనవసరంగా భార్యనయిన నన్ను తిట్టడం కొట్టడమున్నూ చేస్తున్నాడు. ఏవిధంగా శిక్షిస్తారో—ఇతడిబాధ పడలేకుండా ఉన్నాను" అని ఆస్త్రీ ఏడ్చింది.

"ఇందుకు నీవేమి చెప్పుకొంటావు" అన్నాడు మేస్త్రీటు.

"దేవరా! నేను ముందుగా నాభార్యను కొట్టలేను. ఆవిడ నన్ను కొడుతూంటే నేను ఆత్మరక్షణకోసం మళ్లీ కొట్టినమాట వాస్తవం- నన్ను కొట్టకుండాచేస్తే నాఅంత మంచివాడు లేడు."

"సరే కొట్టినట్టు వప్పుకొన్నావుకాబట్టి నీకు శిక్ష వేస్తున్నాను. ముక్కోణానికికట్టి యితణ్ణి ముప్పైఁదెబ్బలు కొట్టండి" అన్నాడు మేస్త్రీటు.

ఆ స్త్రీ, కనిష్టీబూ, పురుషుడూ వెళ్ళిపోయారు. అక్కడే ముక్కోణంకట్టి కొడతారేమో అనుకొన్నాను కాని అంతపని జరగలేదు.

ఒకస్త్రీ ఒకపురుషుడూ ప్రవేశించారు.

"ఇతడేమిచేశాడు" అన్నాడు మేస్త్రీటు.

"దేవరా, ఎంతడబ్బు గడిస్తున్నా అంతా తానే ఖర్చుపెట్టుకొంటున్నాడుగాని నా ఖర్చులకోసం ఒక దమ్మిడీఅయినా నాకివ్వడంలేదు. ఈ దాస్యంనుంచి నాకు విముక్తి యియ్యాలి. అని ఆస్త్రీ మొరపెట్టుకొంది.

"ఏమంటావు" అన్నాడు పురుషుని కేసితిరిగి మేస్త్రీటు.

"దేవరా, నాకువచ్చిన డబ్బంతా సమిష్టికుటుంబానికే ఖర్చుపెడుతున్నానుగాని నేనేమీ మిగుల్చుకోవడంలేదు. నాభార్యకుగాని డబ్బిస్తే అనవసరఖర్చులు చేస్తుందనే భయంతో యివ్వడంలేదు—"

"ఏమిటా అనవసరపు ఖర్చులు?"

"దేవరా, బట్టలూ, నగలూ, పౌడర్లూ నాడబ్బుతో కొనివేస్తే సంసారం జరిగేవిధం ఎలాగ?"

"అట్టివి అనవసరఖర్చు లన్నింటికు ముందుగా ఇరవైరూపా యిలు జుల్మానా చెల్లించు. మరిన్నీ యికముందునుంచీ నీవుసంపా దించిన ధనమంతా నీభార్యకే నీవు యియ్యవలసి ఉంటుంది. అట్లా చెయ్యనినాడు నీకు ౬. మాసాల కఠినవరకం వేయవలసి ఉంటుంది. ఒప్పుకొంటావా?"

"చిత్తం."

భార్యాభర్తలు వెళ్ళిపోయారు. మూడో కేసుకు ఒక స్త్రీ ఒక పురుషుడూ ఒక డజనుమంది పిల్లలూ ప్రవేశించారు.

"ఇతడేమినేరం చేశాడు?" అన్నాడు మేస్ట్రీటు.

"దేవరా, చూడండి" అని ఆస్త్రీ అక్కడనున్న పిల్లలందరినీ చూపింది.

"వాళ్ళంతా మీ పిల్లలేనా?"

"చిత్తం" అని భార్యా భర్తలు ఒప్పుకొన్నారు.

"ఇంతమంది పిల్లలను నీ భార్యచేత కనిపించిన నేరానికి నీవేమి సంజాయిషీ చెప్పుకొంటావు?"

"అందుకు బాధ్యత నా ఒక్కడిదేనా, దేవరా!" అన్నాడు భర్త.

మేస్ట్రీటుకు కోపంవచ్చింది.

"నీవుచేసిన నేరం ఒప్పుకోకుండా అడ్డుప్రశ్నలుకూడా వేస్తు న్నావా? నీకు తగినశిక్ష పడాలి—సంతాన నిరోధానికి సంబం

ధించిన ప్రతి యింగ్లీషుపుస్తకమూ నీవుచదివి నీభార్యకు పాఠం చెప్పాలి. ఆసాధనలు నీవు అన్నీ తెప్పించి యింట్లో పెట్టుకోవాలి. నీ భార్యకోరకై ప్రత్యేకముగా ఈ పుస్తకాలుండే భాండాగార మొకటి నీవు తయారుచెయ్యాలి. అంతేకాకుండా నీపిల్లలకు యిప్పటినుంచీ సెక్సు ఎడ్యుకేషన్ యివ్వాలి. ఇట్లా చేస్తానని ఒక ఇన్‌డెమ్నిటీబాండు వ్రాసియియ్యి. వెళ్ళు" అని తీర్పుచెప్పాడు మేస్ట్రీటు.

కోర్టుసీను ముగిసింది. ఇందులో వచ్చినవాళ్ళెవళ్ళూ పటీరావు కాదని నాదృష్టికి తోచింది.

*　　　　*　　　　*

"బాలెడ్ గరల్" అని బొబ్బుజుట్టుకోమలి పలికింది.

ఒక సరోజముఖి డాన్సుడ్రెస్సుతో వచ్చింది. కొంతసేపు డాన్సుచేసింది. తరవాత ఈపదం పాడింది:

రామా రామా రామా రఘురామా రామా రఘురామా
రాజ్యంకోసం ఆలినివిడిచావా రామా రఘురామా
ఆలిని అడవులపాలు చేసినావా రామా రఘురామా
'ఆలి విషమ్మో రాజ్యమమృతమాయెనా రామా రఘురామా
విన్నావా యీనాటి వింతకథనూ రామా రఘురామా
ఆలికోసమే రాజ్యం విడిచాడు రామా రఘురామా
మారుమనువుపద్మాక్షిని పట్టాడు రామా రఘురామా

ఆలికోసమే విడిచా డధికారం రామా రఘురామా
ఆలి బెల్లమూ రాజ్యమె విషమయ్యే రామా రఘురామా
వెలిదీవుల్లో వెలిశాడా రాజు రామా రఘురామా
విన్నావా యీనాటి వింతకథనూ రామా రఘురామా
అని పాడుతూ వెళ్ళిపోయింది.

* * *

తరవాత క్రమంగా కోయదానివేషం, పడవవాళ్ళ వేషం, ముసుగు విభూతి అవుపేడ వగైరాలతో వితంతువేషం వచ్చాయి. చిట్టచివరివేషం "ఆదర్శప్రాయంగా డ్రస్సువేసుకొన్న స్త్రీ" వచ్చింది.

ఆ స్త్రీ వచ్చీ రావడంతోనే నేను కళ్ళు మూసుకోవలసి వచ్చింది. ఎందుకంటారా? ఏమిచెప్పను. ఆదర్శప్రాయంగా డ్రస్సు వేసుకోవడమంటే దిగంబరత్వమని నేననుకోలేదు. ఈస్త్రీ నిజానికి, పూర్తిగా దిగంబరికాదు. కాకున్నా దిగంబరి మాదిరిగానే ఉంది. ఏమిడ్రస్సు వేసుకొందో, వేసుకోనేలేదో—ఆ దేహానికీ ఆ డ్రెస్సురంగుకీ అవినాభావం సిద్ధించిందో ఏమో తెలియదు.

కళ్ళు మూసుకొన్నాను. మూసుకొని కనురెప్ప సందుల లోంచిమాత్రం ముఖంకేసి చూస్తున్నాను—ఒకవేళ ఆవిడ పటీ రావేమోనని. కాదని ముఖచిహ్నాలనుబట్టి నిశ్చయించాను.

* * *

చివర వేషం పూర్తి అయింది. ఇక పదినిమిషాలలో వేషధారిణులు అందరూ హాలులోకి వస్తారు. భర్తలందరూ జాగరూకులై ఉండవలసిందని బొబ్డుజుట్టు చెప్పి వెళ్లిపోయింది.

౬

ఈ ముద్దు పెట్టుకోవడం సందర్భంలో ఏమి దొమ్మి జరుగుతుందో అని భయపడుతున్నాను. నాబోటి సందేహించే భర్త లొకరిద్దరున్నా మిగిలినవాళ్ళంతా ముద్దుకు తహతహలాడుతూన్నట్లు తోస్తోంది. నామట్టుకు నేను ఏమిచెయ్యవలసి ఉంటుందా అని ఆలోచిస్తున్నాను. వేషధారిణులు వచ్చీ రావడంతోనే పటీరావును నేను గుర్తుపట్టి ముద్దుపెట్టుకుంటే పేచీ ఉండదేమోనని తోచింది.—అయితే నేననుకొన్న మనిషినే యితరభర్తలు కూడా ముద్దుపెట్టుకోవస్తే దొమ్మి జరిగితీరుతుం దనుకొన్నాను.

అంతేకాకుండా దొమ్మి జరుగుతుందనడానికి యింకోకారణం కూడా ఉంది. -ఏమిటంటే—మమ్మల్నందరినీ పోలీసుభయంచెప్పి కూచోబెట్టి ఆడవాళ్ళందరూ యిష్టంవచ్చినట్లు మాజాతినంతనూ దూషించారు. రాగద్వేషా లొక్కమాదిరిగా చూసుకొనే నాబోటివాళ్ళు అక్కడ ఎవరూ లేరుకాబట్టి కసితీర్చుకొనే ఉద్దేశంతో భర్తలందరూ ఉండవచ్చు. ముద్దుపెట్టుకొనే సావకాశం చిక్కినప్పుడు కసితీర్చుకోకుండా ఉంటారా? ఉంటే మానవస్వభావానికి వ్యతిరేకంగా ఉంటుంది.

అయితే అన్ని వేషాలూ నిదానంగా చూచానుగదా ఎవరూ పటీరావులాగ లేరే! ఎవరిని ముద్దుపెట్టుకోవడం? ఆ నవీనస్త్రీకి పటీరావు పోలికలున్నా కంటిమెల్ల, కంఠస్వరభేదమూ గిరజాల జుట్టూ ఉన్నవిగదా. ఆవిడ పటీరావులాగ అవుతుంది. కాకపోతే మరి పటీరావు ఎవరు?

ఎంతకూ ఊహ తెగడంలేదు. ఏమిచేసేదీ తోచడంలేదు.

చివరకు నిర్ణయానికి వచ్చాను. అందరుభర్తలూ తమభార్యలను ముద్దుగొన్నపిమ్మట మిగిలినమనిషి పటీరావు అయివుంటుంది కాబట్టి ఆమనిషిని నేను ముద్దుపెట్టుకోవచ్చు ననుకొన్నాను. అందుకొరకై చివరదాకా కనిపెట్టుకు ఉండడం మంచిదని నిశ్చయించాను.

అయితే భర్తలందరూ తమభార్యలనే ముద్దుపెట్టుకో గలుగుతారని ఎలాగ చెప్పగలము? వారుమాత్రం భార్యలను సరిగా పోల్చుకోగలరా? అంతేకాకుండా ఒకభర్త ఒక్కస్త్రీనే ముద్దుపెట్టుకొంటాడనేమాట ఎక్కడుంది? తెగించినవాళ్ళు చేతికి చిక్కిన మనిషినల్లా ముద్దుపెట్టుకొంటే అప్పుడు చేసేదేమిటి?

ఇంకోవిషయంకూడా ఉంది. ఈరోజున ఒక ప్రైజుకూడా ఉండవచ్చునని పటీరావు సూచించింది. ఆ బహుమానం సరిగా ముద్దుపెట్టుకో గలిగినవారికా, పెట్టుకోలేనివారికా ఎవరికి? సరిగా ముద్దుపెట్టుకోగలిగితే వేషములో నున్నభార్యను పోల్చుకో గలి

గాడని భర్తకు బహుమాన మియ్యవచ్చు. సరిగా ముద్దుపెట్టుకో లేకపోతే వేషము దుర్భేద్యముగా వేసుకొన్నందుకు-భర్తన మేతం గుర్తించలేనంత గూఢంగా వేసుకొన్నందుకు భార్యకు బహుమాన మియ్యవచ్చు. ఇదీ నిష్కర్షగా తేలలేదు.

ఇంతకీ వటీరావుమనస్సు ఏవిధంగా నడుస్తోందో? నేను సరిగా పోల్చవలెననే కోరుకొంటోందో, పోల్చుకోకుండా ఉంటే బాగుం టుందని అనుకొంటోందో తెలియడం కష్టంగా ఉంది.

ఈవిధంగా ఆలోచిస్తూండగా బాబ్జుపద్మాక్షి బెత్తం చేత్తో పట్టుకు ప్రవేశించింది. ఆవిడవెనకే వేషధారిణులందరూ ప్రవే శించారు. పదముగ్గురు స్త్రీలూ పన్నెండుగురు పురుషులూ వేషాలతోనే ప్రవేశించారు. స్త్రీ వేషధారిణులను వేరుగాను పురుషవేషధారిణులను వేరుగాను నిలబెట్టింది బాబ్జుజుట్టు.

గ్రామఫోను పాట పాడుతోంది—"ఎంకీవంటిపిల్ల లేదోయి, లేదోయి, ఎంకీ నావంకింక రాదోయి రాదోయి" అని.

బాబ్జుజుట్టు బెత్తంఎత్తి మాకేసిచూచి యిట్లా చెప్పింది— "భర్తలందరూ దయచేసి మీమీ భార్యలను ముద్దుపెట్టుకో వలెను. తొందరపడి తప్పు ముద్దుపెట్టుకోవడం కూడదు కాబట్టి భర్తలందరూ నిదానంగా అందరినీచూచి, వారిలో మీమీ భార్యలను పోల్చుకొని ముద్దుపెట్టుకోవలెను. అల్లరి ఎంతమా

త్రేము కూడదు. నామాటలు లక్ష్యపెట్టక అల్లరికే దిగినట్లైతే తగినచర్య తీసుకోడానికి మేమందరమూ సిద్ధముగా ఉన్నాము. చెప్పవలసినమాట చెప్పక తప్పిందికాదు గనక చెప్పాను. మీ రేమీ అనుకోవద్దు. మీపట్ల ఎంత సద్భావము చూపుతూ మేము మిమ్ము ఆహ్వానించామో అంత సద్భావమూ మీరు మాపట్ల జూపుతూ ఈ ఉత్సవము నిర్విఘ్నంగా జరిగిందనిపించ డానికి తోడ్పడతారని ఆశిస్తున్నాను. థాంక్సు" అని ముగించింది.

దొమ్మి జరుగుతుందనే భయంపోయింది నాకు. మిగిలిన భర్త లకూ ఉత్సాహభంగం అయినట్టు తోస్తోంది. అక్కడ స్త్రీలతో దొమ్మియుద్ధం చేయడానికీ పోలీసులను పిలిపించుకోవడానికీ ఎవరు ఒప్పుకుంటారు గనక.

మేమందరమూ నెమ్మదిగా లేచాము. నేను లేచినచోటే నిల బడి ఉన్నాను వేషధారిణులను మళ్ళీ పరిశీలిస్తూ! ఒకభర్త ఎరుకసానిని ముద్దుపెట్టుకొన్నాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

"రైట్" అంది బొబ్డుజుట్టు. ఒకడు మేస్త్రీటును ముద్దుపెట్టు కోబోయి కనిస్టేబుని ముద్దుపెట్టుకొన్నాడు.

"రాంగ్—గో బాక్ ప్లీజ్" అంది బొబ్డుజుట్టు.

చల్ మోహనరంగ పాటపాడిన స్త్రీని ఒకడు తొందరగా ముద్దుపెట్టుకొని బొబ్డుజుట్టుచేత చివాట్లు తిన్నాడు.

ఒకడు నవీనస్త్రీని ముద్దుపెట్టుకొన్నాడు. నాకు ఒకవిధంగా కోపం వచ్చింది.

బాబ్డుజుట్టు "రైట్" అంది. నేను పటీరావనుకొన్న స్త్రీ పటీరావుకాదు. ఏమిచేశేదింక. ఒకడు 'అత్త' ను ముద్దుపెట్టుకొని 'రైట్' అనిపించుకొన్నాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

ఒకడు నవీనస్త్రీ భర్తదగ్గిరికి వెళ్ళి గట్టిగా ముద్దుపెట్టుకొన్నాడు కాబోలు మీసాలూడాయి. అందరూ నవ్వారు. 'రైట్' అంది బాబ్డుజుట్టు.

పతివ్రత భర్తనూ, దండోరా కనకాంగినీ, పడవవాళ్ళనూ, వితంతువునూ రైటుగా భర్తలు ముద్దుపెట్టుకొన్నారు. పతివ్రతను, బాలెడ్ గరల్‌ను, ఆదర్శప్రాయమైన బట్టలు కట్టినావిడను రాంగుగా ముద్దుపెట్టుకొన్నారు. అందరుభర్తలూ అందరినీ సరిగానో తప్పుగానో ముద్దుపెట్టుకోవడం అయింది. ఒకరిద్దరు తప్పు ముద్దుగొన్నవాళ్ళు మళ్ళీ యింకోరిని ముద్దుపెట్టుకొని చివాట్లు తిన్నారు. ముద్దుపెట్టుకుందామన్నా నాకు ఆడదిలేదు. అయినా పటీరావు ఎవరో తెలియకుండా ముద్దుపెట్టుకోవడం ఎలాగ?

భర్తలలో నేనొక్కడనే మిగిలాను ముద్దుపెట్టుకోనివాణ్ణి. భార్యలలో ముద్దు పెట్టించుకోనివాళ్ళు ఎవరూలేరు!

గ్రామఫోను పాడుతూనేఉంది "ఎంకీ వంటిపిల్ల లేదోయి లేదోయి" అని. ఆమాట నిజమే. నా పటీమాత్రం ఎక్కడున్నదీ తెలియడంలేదు.

బొబ్డుజుట్టు నాకేసితిరిగి జాలిగా 'వెల్ మిస్టరు రావ్' అంది.

నేను తటపటాయిస్తున్నాను. "మళ్ళీ పరిశీలనగాచూచి మీ భార్యను కనుక్కోలేరా?" అంది. "చూస్తాను" అని మళ్ళీ పరిశీలన మొదలుపెట్టాను.

వటీరావుపోలిక ఉన్నవాళ్ళు ఎవళ్ళూ కనిపించలేదు. ఎత్తు లావులు సరిపోయినా ముఖలక్షణాలు సరిపోవడంలేదు.

"వెల్" అంది బాబ్డుజుట్టు.

"సారీ, నేను కనుక్కోలేను" అన్నాను.

"స్టెపవుట్, వటీ" అని బాబ్డుజుట్టు అనడంతోనే ఆదర్శ ప్రాయమైన డ్రెస్సువేసుకొన్న యిల్లాలు ముందుకు వచ్చింది. నేను ముఖం తిప్పుకొన్నాను.

"ఈమారు మీ వటీరావును ముద్దుపెట్టుకోండి" అంది బాబ్డు జుట్టు. ఆశ్చర్యం! ఆదర్శప్రాయురాలిని చూచాను. ఆవిడ వటీ రావులా లేదు.

"ఆవిడ వటీరావుకాదు. నేను ముద్దుపెట్టుకోను" అన్నాను.

"వెల్ వటీ" అంది బాబ్డు. వటీవచ్చి అమాంతంగా నన్నే ముద్దుపెట్టుకొంది. ముద్దుపెట్టుకొనే వైఖరిమాత్రం వటీరావుదే అని గ్రహించాను. మరి ఆముఖలక్షణాలు మారడానికి కారణం ఏమిటో?

హాలు హాలంతా గోల అవుతోంది. చప్పట్లు, నవ్వులు, కేకలు, గ్రామఫోనుపాట.

ఆవిడ కేసి నిదానించి చూస్తున్నాను. ఆవిడ నోటిలోనుంచి రెండు పాడ్‌లు తీసింది. బూరటిల్లిన బుగ్గలు సర్దుకొన్నాయి. ముక్కును చేతితో పట్టుకు ఊడలాగింది. ఆ పెట్టుముక్కు చేతిలోకి వచ్చింది. వటీరావు నవ్వుముఖమూ, బనియను తొడుక్కున్న దిగంబర దేహమూ గోచరించాయి.

"భర్తలందరూ దయచేసి కూర్చోండి" అంది బాబ్డుజుట్టు. అందరూ కూర్చున్నారు. అయ్యో కొయ్యోడా పాట పాడుతోంది గ్రామఫోను.

అరగంటలో భార్యలందరూ మామూలు వేషాలతో ప్రత్యక్షమై మాపక్క కూర్చున్నారు.

బాబ్డుజుట్టువచ్చి చెప్పింది—"ఈకార్యము నిర్విఘ్నముగా జరిగినందుకు భర్తలను మేము ప్రశంసిస్తున్నాము. భర్తలను తీసుకొని రావడములోనూ, వేషములు వేయడంలోనూ భార్యలు చూపిన చాకచక్యమునకు వారికి క్లబ్బు వందనము లర్పిస్తోంది.

ఈనాటి ప్రథమబహుమానము రావుగారిది. మర్యాదగా గుర్తుపట్టలేనని వప్పుకొన్నందుకు ఆయనకు బహుమాన మివ్వడమైనది. భర్తను భ్రమలోపెట్టిన మిసెస్ వటీరావుకుకూడా బహుమానమున్నది. భర్తలు సరిగా ముద్దుపెట్టుకొన్నందుకు వారికిని, సరిగా పోల్చుకోలేకపోయిన భర్తల భార్యలకునూ కాంసొలేషన్ బహుమతులు.

మాకందరికీ బహుమతులు బొబ్బుకన్యకే పంచిపెట్టింది. నాకు సులోచనాలూ, మంచి కెమిరా బహుమానంకింద వచ్చినవి. పటీరావుకు సెక్సుబుక్కుల దొంతరా, నిలువుటద్దమూ బహుమానాలు.

బొబ్బుకన్యక—"జాతీయగీతం" అంది. అందరమూ లేచాము. ఆడవాళ్ళందరూ అవ్యక్త మధురకంఠాలతో పాడారు—

"జనగణమన అధినాయక జయ హే, భారతభాగ్యవిధాతా!"

# మిస్సుల బహుమానం

౧

క్లబ్బునుంచి పటీరావు ధుమధుమలాడుతూ యింటికి రావడ మనేది సామాన్య ధర్మంకాదు. కాని యింటినుంచి ధుమధుమ లాడుతూ క్లబ్బుకు వెళ్లడమే సామాన్యధర్మం. ఆనాడుమాత్రం తద్వ్యతిరేకంగా జరిగింది. ఇట్టి విశేషధర్మానికి కారణ మేమిటో ఊహించలేకపోయాను. నాకుమాత్రం యిది అనుకూలంగానే ఉన్నది. ఎందువల్లనంటే ఇట్టి చర్యవల్ల మాకు అన్యోన్యం